# సిద్ధిపేట తరహాలో జనగామ అభివృద్ధి..

- జిల్లా కేంద్రం రూపురేఖలు మారుస్తా
- ఆశీర్వదిస్తే ప్రజాసేవలో ముందుంటా
- కాంగ్రెస్‌కు ఓటేస్తే ఆగమైపోతం
- మోసగాళ్లను నమ్మితే గోస పడాల్సిందే
- ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ జనగామ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా



జనగామలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ, అక్టోబర్ 31 (నమస్తే తెలంగాణ) : అభివృద్ధి.. ఆహ్లాదం.. సుందరీకరణలో సిద్దిపేట, సిరిసిల్ల, గజ్వేల్ సరసన జనగామ పట్టణాన్ని నిలబెడుతానని, ప్రజలు ఆదరించి ఆశీర్వదిస్తే జిల్లా కేంద్రం రూపురేఖలు మారుస్తానని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం జనగామ పట్టణంలోని 20, 21, 22, 28, 29, 30 వార్డుల్లో ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించి ప్రజలను కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయా వార్డుల్లో పల్లాకు కౌన్సిలర్లు జూకంటి లక్ష్మి, కర్రె శ్రీనివాస్, మహ్మద్ సమద్, ముస్త్యాల దయాకర్, బొట్ల శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఘన స్వాగతం పలికారు. పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం కేసీఆర్‌కు దగ్గరగా ఉండే తనకు జనగామ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే అవకాశం లభించిందన్నారు. ప్రజలు ఆశీర్వదిస్తే అందరివాడిగా పనిచేస్తానని, జనగామకు పెద్ద పాలేరుగా ఉంటానని అన్నారు. పట్టణానికి స్వచ్ఛమైన మంచినీళ్లు అందించడమే తన తొలి ఎజెండా అంశంగా ఆయన పేర్కొన్నారు. పెద్దసారు కేసీఆర్ నామీద నమ్మకంతో జనగామ అభ్యర్థిగా వెళ్లమన్నప్పుడు నియోజకవర్గంలోని ఎనిమిది మండలాలకు వెళితే అందరూ ఆశీర్విదించారని అన్నారు. పెద్దసారు జనగామ జిల్లా ఇచ్చారు. ఇక్కడి రైతులకు సాగునీరు ఇచ్చారు. మెడికల్ కాలేజీ ఇచ్చారు. ఇంకా ఏం కావాలో సారుకు తెలుసన్నారు. పోరాటాల గడ్డ జనగామ. తెలంగాణ సాయుధ పోరాటం, ప్రత్యేక రాష్ట్రా సాధన పోరులో ముందున్న ప్రాంతం అని అన్నారు. కేసీఆర్ గులాబీ జెండా ఎత్తిన నాడు కూడా సిద్దిపేటకు ఆనుకొని ఉన్న జనగామ మీ వెంట నడించిందని పల్లా పేర్కొన్నారు. జనగామకు మెడికల్ కాలేజీ ఇచ్చారని, దాంతోపాటు నర్సింగ్ కాలేజీ, పారా మెడికల్ కాలేజీ, పాలిటెక్నిక్, వెటర్నరీ కాలేజీ సాధించుకుందామని అన్నారు. అభివృద్ధి చెందుతున్న జనగామకు అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, రంగప్ప చెరువు అభివృద్ధి, ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్, డీసీపీ ఆఫీసు, స్పోర్ట్ స్టేడియం, కళాభవనం కావాలని, బచ్చన్నపేట, చేర్యాల, నర్మెటలో ప్రభుత్వ జూనియర్ కాలేజీ సాధిస్తానని తెలిపారు. జనగామ యువత కోసం ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను స్థాపించేందుకు సీఎం కేసీఆర్‌ను ఒప్పిస్తానని అన్నారు. గజ్వేల్, సిద్దిపేట అభివృద్ధిని చూసిన జనగామ ప్రజలు వాటి లాగా ఉండాలనే ఆకాంక్ష మేరకు జనగామను బంగారు తునకగా మారుస్తానని చెప్పారు. ప్రజలు ఆశీర్వాదం ఇస్తే సీఎం కేసీఆర్ వద్ద నుంచి పెద్దఎత్తున నిధులు తెచ్చి జనగామ నియోజకవర్గానికి పెద్ద పాలేరుగా పనిచేస్తానని అన్నారు.

**కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే ఆగమైపోతం..**

కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే ఆగమైపోతమని..పొరపాటున ఆ మోసగాళ్లను నమ్మితే గోస పడాల్సి వస్తుందని బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. రైతుబంధు సాయాన్ని నిలిపివేయాలని ఆ పార్టీ నాయకులు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారంటే కాంగ్రెస్‌కు రైతులపై ఎంత ప్రేమ ఉందో అర్థం అవుతుందన్నారు. కాంగ్రెస్, బీజేపీ మాటలు నమ్మి ఆగం కావొద్దు.. సెక్యులర్ పార్టీ పేరుతో కాంగ్రెస్ ముస్లిం ఓట్లు దండుకుని అభివృద్ధిని విస్మరించిందన్నారు. మన రాష్ట్రంలో అమలు చేస్తున్న రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ వంటి సంక్షేమ పాలనను పక్కనున్న కర్ణాటకలో కాంగ్రెస్ ఎందుకు అమలు చేయడం లేదని పల్లా ప్రశ్నించారు. తాము అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో అమలు చేయని పథకాలు తెలంగాణలో అమలు చేస్తామని హామీ ఇచ్చి ప్రజలను మోసం చేసేందుకు ప్రయత్నం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. అసలు మీ పాలనకు కేసీఆర్ పాలనకు పొంతన ఉందా? ఉద్యమ సమయంలో ఊర్లు తిరిగిన సందర్భంలో రైతులకు దొంగరాత్రి కరెంటు ఇచ్చి..అదీ కూడా ఎప్పుడు వస్తుందో ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి ఉండేదన్నారు. లోవోల్టేజీతో మోటార్లు కాలి రైతులు ఆగమై..అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకున్నారని ఆయన వివరించారు. కేసీఆర్ అంటే నమ్మకంతోపాటు బీఆర్ఎస్ పాలన పట్ల ప్రజలకు విశ్వాసం ఉందన్నారు. గతంలో ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టిన ఏ ఒక్కటైనా కాంగ్రెస్ పార్టీ అమలు చేసి చూపిందా? అదే బీఆర్ఎస్ మ్యానిఫెస్టోలో పెట్టినవి..పెట్టనవి కూడా అమలు చేసిండు..మావి ఓట్ల కోసం అమలు చేసే పథకాలు కాదు..ప్రజల అవసరాలు తెలుసుకొని చేసే పనులని అన్నారు. ఎన్నికల ప్రచారంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమున, వైస్ చైర్మన్ మేకల రాంప్రసాద్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు తాళ్ల సురేశ్‌రెడ్డి, మహిళా, యూత్ నాయకులు చెంచారపు పల్లవి, మల్లికాంబ, నాయకులు బండ యాదగిరిరెడ్డి, జూకంటి శ్రీశైలం, బిజ్జాల నవీన్, కౌన్సిలర్లు బండ పద్మ, పేర్ని స్వరూప, అనిత, మల్లవరపు అరవింద్, మల్లిగారి రాజు, గాడిపెల్లి ప్రేమలతారెడ్డి, పాండు, మసిఉర్ రహమాన్ పాల్గొన్నారు.



కూనూరులో కడియం శ్రీహరికి ఘన స్వాగతం పలుకుతున్న ప్రజలు (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న కడియం శ్రీహరి

## గ్రామాల అభివృద్ధే నా ఎజెండా

- ప్రజలు ఆశీర్వదిస్తే నియోజకవర్గానికి సేవలందిస్తా
- అవినీతి కాంగ్రెస్, మతోన్మాద బీజేపీకి గుణపాఠం చెప్పాలి
- బీఆర్ఎస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి
- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే అభ్యర్థి కడియం శ్రీహరి

జఫర్‌గఢ్, అక్టోబర్ 31 : ప్రజలు ఆశీర్వదించి భారీ మెజార్టీతో గెలిపిస్తే గ్రామాల అభివృద్దే ఎజెండాగా పని చేస్తానని బీఆర్ఎస్ స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి అన్నారు. మండలంలోని కూనూరు, రఘునాథపల్లి, ఉప్పుగల్లు, తమ్మడపల్లి(ఐ), తిమ్మంపేట గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన పార్టీ గ్రామస్థాయి విస్తృత సమావేశాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కడియం శ్రీహరి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యేగా అభ్యర్థిగా తనకు అవకాశం ఇచ్చారని, ప్రజలు ఆదరిస్తే ఎమ్మెల్యేగా సేవలందిస్తానని అన్నారు. 1994, 1999, 2008లో ఎమ్మెల్యేగా, మంత్రిగా పని చేశానని, 2014లో ఎంపీగా, డిప్యూటీ సీఎంగా సేవలందించానని తెలిపారు. రాజకీయాలను ప్రజా సేవకే వినియోగించాను తప్ప ఏనాడు ప్రజలకు తలవంపులు తెచ్చే పని చేయలేదని శ్రీహరి అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుబంధు, రైతుబీమా పథకాలు అమలు చేయడంతోపాటు వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ అందిస్తున్నట్లు తెలిపారు. పోరాడి సాధించుకున్న రాష్ట్రాన్ని సీఎం కేసీఆర్ అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారని వివరించారు.

**అవినీతి కాంగ్రెస్, మతోన్మాద బీజేపీకి గుణపాఠం చెప్పాలి**

దేశంలో ఎక్కడాలేని విధంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న బీఆర్ఎస్ పాలనపై ఆరోపణలు చేస్తున్న కాంగ్రెస్, బీజేపీకి ప్రజలు గుణపాఠం చెప్పాలని కడియం శ్రీహరి కోరారు. అవినీతికర కాంగ్రెస్, మతోన్మాద బీజేపీకి ఎన్నికల్లో బుద్ధి చెప్పాలన్నారు. తెలంగాణలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎందుకు అమలు చేయడం లేదో నిలదీయాలని ఆయన ప్రజలను కోరారు. కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ తెలంగాణ లో మాట్లాడుతూ వారి రాష్ట్రంలో వ్యవసాయానికి కేవలం 5 గంటల కరెంట్ ఇస్తున్నామని ప్రకటించాడని, దీనిని పరిశీలిస్తే కాంగ్రెస్ పాలన ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చున్నారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా పాలన అందిస్తున్న సీఎం కేసీఆర్‌ను మరోసారి సీఎంను చేయాలని కోరారు. ఈ ఎన్నికల్లో తన విజయానికి అన్నివర్గాల ప్రజలు మద్దతు పలకాలని విజ్ఞప్తి చేశారు.

**ఘన స్వాగతం పలికిన ప్రజలు..**

బీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశాలకు హాజరైన ఎమ్మెల్యే అభ్యర్థి కడియం శ్రీహరికి ఆయా గ్రామాల ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా డప్పు చప్పుళ్లు, కోలాటాలతో ర్యాలీ నిర్వహించారు. మహిళలు బతుకమ్మలతో వచ్చి మంగళహారతులతో కడియం శ్రీహరికి స్వాగతం తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ రడపాక సుదర్శన్, జడ్పీటీసీ ఇల్లందుల బేబి, పీఏసీఎస్ చైర్మన్ తీగల కర్ణాకర్‌రావు, స్టేషన్‌ఘన్‌పూర్ మార్కెట్ చైర్మన్ గుజ్జరి రాజు, వైస్ ఎంపీపీ కొడారి కనకయ్య, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు జయపాల్‌రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు ఇల్లందుల కుమార్, బొమ్మినేని శ్రీదేవి, గాదెపాక సువర్ణ, గాదెపాక అనిత, మంద మల్లేశం, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు ఎడ్ల వెంకటస్వామి, మాజీ మార్కెట్ చైర్మన్ అన్నం బ్రహ్మారెడ్డి, రాజేశ్‌నాయక్, ఇల్లందుల శ్రీనివాస్, గాదెపాక సుధాకర్‌బాబు, పెద్దిరెడ్డి, అశోక్, ధనుంజయ్, సంపత్ పాల్గొన్నారు.



సాధించిన పతకంతో చేతన్‌శౌర్య

## బ్యాడ్మింటన్ పోటీల్లో విద్యార్థులకు పతకాలు

నయీంనగర్, అక్టోబర్ 31 : హైదరాబాద్‌లో నిర్వహించిన ఆల్ ఇండియా సబ్ జూనియర్ నేషనల్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో పోచమ్మకుంటలోని ఎస్ఎస్ కాన్సెప్ట్ హైస్కూల్ విద్యార్థులు పతకాలు సాధించారు. అండర్-13 బాలుర విభాగంలో డబుల్స్‌లో గోల్డ్‌మెడల్‌లో మొదటి ర్యాంక్, సింగిల్స్‌లో బ్రాంజ్ మెడల్‌ను స్కూల్‌కు చెందిన విద్యార్థి సామల శ్రీ చేతన్ శౌర్య సాధించగా, కరస్పాండెంట్ గూడెపు రమేశ్ అతడిని అభినందించారు.

## బీఆర్ఎస్‌లో చేరికలు

హనుమకొండ, అక్టోబర్ 31: బీఆర్ఎస్ పార్టీలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తల చేరికల పర్వం కొనసాగుతోంది. అభివృద్ధి, సంక్షేమ పథకాలు, కేసీఆర్ భరోసాపై పూర్తి నమ్మకంతో బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరుతున్నారు. మంగళవారం నగరంలోని 8, 9 డివిజన్లకు చెందిన బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తలు వంద మంది వరకు పశ్చిమ నియోజక వర్గం అభ్యర్థి, చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు.

## సరైన శిక్షణతోనే సజావుగా ఎన్నికల నిర్వహణ

**జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శివలింగయ్య**



పోలింగ్ ఆఫీసర్లు, సిబ్బందికి సూచనలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సీహెచ్ శివలింగయ్య

స్టేషన్ ఘన్‌పూర్, అక్టోబర్ 31 : పోలింగ్ కేంద్రాల్లో విధులు నిర్వర్తించే ఎన్నికల అధికారులు, సిబ్బంది సరైన శిక్షణ తీసుకుంటేనే ఎన్నికల రోజు సమస్యలను అధిగమించవచ్చని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ శివలింగయ్య అన్నారు. మంగళవారం నియోజవర్గ కేంద్రంలోని విద్యాజ్యోతి డిగ్రీ కళాశాలలో పీవో, ఏపీవో, క్లస్టర్ ఇన్‌చార్జీలతో నిర్వహించిన శిక్షణ తరగతులను ఆయన పరిశీలించారు. మొదటి రోజు 300 మందికి, రెండో రోజు 275 మందికి ఆరుగురు మాస్టర్ ట్రైనర్లు ఎన్నికల నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా శిక్షన తరగుతుల్లో నేర్చుకున్న విషయాలను వారి ద్వారా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శివలింగయ్య మాట్లాడుతూ పోలింగ్ రోజు ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ మెటీరియల్‌ను, ఓటర్ లిస్టు, ఈవీఎంలను చెక్ చేసుకోవాలని కోరారు. పోలింగ్ స్టేషన్ పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించి ఓటర్లకు కావాల్సిన ఏర్పాట్లు చేసుకోవాలని, పోలింగ్ బూత్‌ల్లో ఎలాంటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అక్కడి పంచాయతీ కార్యదర్శి, బీఎల్‌వో, అంగన్‌వాడీ టీచర్ సహకారం తీసుకోవాలని, పోలింగ్ పూర్తయ్యాక నిబంధనల ప్రకారం ఎన్నికల సామగ్రిని తిరిగి అప్పజెప్పాలని సూచించారు. ఈ సమావేశంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో వాసం రామ్మూర్తి, జిల్లా అధికారులు సీపీవో ఇస్మాయిల్, నాగులు, రామాచారి, కోర్నేలియస్, మనోహర్, స్టేషన్ ఘన్‌పూర్, ధర్మసాగర్, రఘునాథపల్లి తహసీల్దార్లు వెంకటేశ్వర్లు, సదానందం,యుగేందర్, జఫర్‌గఢ్ డిప్యూటీ తహసీల్దార్ బాసెట్టి హరిప్రసాద్, ఆర్ఐలు అర్జున్, రవీందర్ పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ ఐక్యతా దినోత్సవం

హనుమకొండ/సుబేదారి, అక్టోర్ 31: సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని మంగళవారం హనుమకొండ కలెక్టరేట్‌లో ఘనంగా జాతీయ ఐక్యతా దినోత్సవం నిర్వహించారు. కలెక్టరేట్‌లోని సమావేశం మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ జాతీయ సమగ్రతకు పాటుపడాలని కోరారు. అనంతరం దేశ సమైక్యతను కాపాడుకుందాం అని ప్రతిజ్ఞ చేశారు.కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, అదనపు కలెక్టర్ మహేందర్ జీ, డీఆర్వో గణేశ్ పాల్గొన్నారు. అలాగే, వరంగల్ పోలీసు కమిషనరేట్ ఆధ్వర్యంలో హనుమకొండ అశోకా జంక్షన్ నుంచి కమిషనరేట్ కార్యాలయం వరకు 2కే రన్ కార్యక్రమాన్ని కమిషనర్ అంబర్ కిశోర్ ఝా ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ దేశ ప్రజలు కులాలు, మతాలకతీతంగా సోదర భావంతో దేశ అభివృద్ధిలో పాలుపంచుకోవాలన్నారు. మహనీయులను స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు మురళీధర్, రవీందర్, అబ్దుల్ బారి, సంజీవ, సురేశ్‌కుమార్, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.



హనుమకొండలో 2కే రన్ ప్రారంభిస్తున్న సీపీ అంబర్ కిశోర్ ఝా